**కథ**

# కర్మయోగం

**తాడిమేటి శ్రీదేవి**

**"శారదా ఓ శారదా! ఏం చేస్తున్నావు తల్లీ!"**

**బట్టలు నానబెడుతున్న నేను కళ్యాణి గొంతు వినిపించగానే "వస్తున్నా" అంటూ చేతుల నురుగు పోవడానికి మగ్‌లో గబగబా ఆడించి లేచాను.**

**"ఇంత ఉదయాన్నే వచ్చిందేమిటబ్బా" అనుకుంటూ చేతులు కొంగుకి తుడుచుకుంటూ హాల్లోకి వెళ్లాను. మళ్లీ వెంటనే కూర కలపాలని గుర్తువచ్చి వంటింట్లోకి నడిచాను 'రా రా' అంటూ.**

"ఏంటి ఇంకా ఇలాగే ఉన్నావు? ఇవాళ జనార్ధనస్వామి గుళ్లో లక్ష తులసి పూజని చెప్పానుకదా మర్చిపోయావా?" హడావుడి పడిపోతోంది చీర అంచులు సవరించుకుంటూ.

అప్పుడు గుర్తొచ్చింది రెండు రోజుల క్రితమే తనీ సంగతి చెప్పిన విషయం. "నేను రానులే నువ్వెళ్లు" కూర కలుపుతూ తల దించుకుని చెప్పాను.

"నీ ఖర్మ" సన్నగా గొణిగి వెళ్లిపోయింది.

మనవరాలు శ్వేత పుట్టిన ఏడేళ్లకి కోడలు మళ్లీ కడుపుతో ఉంది. మధ్యలో రెండు అబార్షన్స్ అవ్వడం వల్ల బాగా నీరసపడి పోయింది. తనని పూర్తి బెడ్‌రెస్ట్ తీసుకోమని చెప్పారు డాక్టర్లు. కన్నవారి ఊరు పల్లెటూరు కావడం వల్ల ఈసారి అక్కడకి పంపి రిస్క్ తీసుకోమని, కావాలంటే మీరే వచ్చి మీ అమ్మాయి పురుడు దగ్గరుండి చేయించుకోవచ్చని అబ్బాయి ఖచ్చితంగా చెప్పేశాడు. వియ్యపురాలికి ఇంట్లో ఆవిడ ముసలి అత్తగారి చాకిరీ. పురిటి టైముకి ఎలాగో వీలుచూసుకుని వస్తానని వదల్లేక వదల్లేక వెళ్లిందావిడ పాపం.

మనవరాలికి, అబ్బాయికి క్యారియర్ల టైమ్‌కి వంట చేసివ్వడం, చిన్నా, చితకా పనులతో అలసటగానే ఉంటోంది. కానీ కోడల్ని చూస్తే జాలి వేస్తుంది. కూర్చుని చేయించుకునే మనిషి కాదసలు. వీలైనంత వరకూ సాయం చేయడానికి ప్రయత్నిస్తుంది. నేను కూడా పనులకి రానివ్వడం లేదు. ఆరోగ్యం ముఖ్యమంటూ. ఆ పురుడు తీరిపోయి తల్లీ, బిడ్డా వేరయితే ఇంకా చూసుకోవడం పెద్ద కష్టం కాదు. దాని గురించే వెయ్యి దేవుళ్లకి మొక్కుతున్నాను కూడాను.

ప్రొద్దున్నే గుడికి వెళ్లడానికి నాకెక్కడ తీరుతుంది. కానీ ఇలాంటి రోజుల్లో గుడికి వెళ్లలేకపోవడం కొంచెం చివుక్కుమనిపించింది. కళ్యాణి ఇంట్లో ఇటుపుల్ల అటు పెట్టదు. ఉద్యోగం చేసే కోడలు పిల్ల ఇంట్లో అన్నీ సవరించుకుని గడప దాటాల్సిందే. "నేను కష్టపడినన్నాళ్లు పడ్డాను. ఇంక నాది కృష్ణా! రామా! అనుకుంటూ పరాన్ని గురించి ఆలోచించే వయసని" తెగేసి చెప్తుంది. అటు జనార్ధనస్వామి గుడి, ఇటు కపిలేశ్వరుడి గుడి, సాయిబాబా ధ్యాన మందిరం అన్నింట్లోనూ తనదే పై చెయ్యి. ప్రతీ పూజ, భజన, కథాకాలక్షేపాలు అన్నీ తన ఆధ్వర్యంలోనే జరుగుతున్నట్లు హడావుడి చేసేస్తూ ఉంటుంది. చిన్నతనాల్లో పెళ్లిళ్లయి ఈ ఊరి కోడళ్లవ్వడం వలన తనకూ, నాకూ ఎప్పటినుంచో స్నేహం ఏర్పడిపోయింది.

వంట చేస్తున్నాన్న మాటేగానీ ఆలోచనలు ముసురుకుంటున్నాయి. అందరూ పూజలూ, వ్రతాలూ అంటుంటే నాకు మాత్రం ఈ జంఝాటాలు పెరిగిపోతున్నాయి. విసుగ్గా అనుకున్నాను.

శ్వేత వచ్చింది "బాటిల్‌లో నీళ్లు పట్టేసుకున్నారు. క్యారియర్ పెడతావా బామ్మా!" అంటూ.

"ఉండు తల్లీ ఇంకా వంటవ్వలేదు. కాళ్లకింద నిప్పులు పోసేస్తున్నారు" విసురుగా అన్నారు. అది మొహం చిన్నది చేసుకుని వెనక్కి తిరిగి వెళ్లిపోయింది.

"ఏంటోయ్! నీ ఫ్రెండ్ ప్రొద్దున్నే వచ్చింది. ఈరోజు ఏ గుడి పావనం చేస్తుందిట?" అంటూ వచ్చారు ఆయన.

"అందరూ నాలాగే ఇల్లే వైకుంఠంలా ఉంటారా? నాకీ లంపటం జన్మంతా తప్పేలా లేదు" గట్టిగా అన్నాను కాఫీ గ్లాసు టక్కున టేబుల్ మీద పెడుతూ. కోడలూ వంటింటి వైపు రాబోతున్నదల్లా నామాట విని పక్కకు తప్పుకుంది. ఆయన ఆశ్చర్యంగా నావేపోసారి చూసి కాఫీగ్లాసుతో వెళ్లిపోయారు.

తరువాత ఏ పనీ రోజూలా మనసుపెట్టి చెయ్యలేకపోయాను. మధ్యాహ్నం "అంట్లు త్వరగా ఎయ్యండమ్మా ఈరోజు నేటయిపోనాది" అంటున్న పనిమనిషి మాటలకి-

"ఉండవే నాకేమైనా నలభై చేతులు ఉన్నాయనుకున్నావా? కాసేపాగలేవూ" కసిరాను. ఆ మాటకి అది పది నిమిషాల పాటు సణుగుతూ నా విసుగును మరింత పెంచింది. నా విసుగుకి తోడు పాలు పొంగిపోవడంతో స్టవ్ గట్టు కడగడం పని ఒకటి తోడయ్యింది. నా అసంతృప్తి అంతా నా గొణుగుడు, విసుర్లతో బయట పడింది. అబ్బాయి, కోడలు కొంచెం చిన్నబుచ్చుకున్నట్లు గమనించినా పట్టించుకోవాలనిపించలేదు. ఏదో మిస్ అవుతున్నాననే బాధ నన్ను బాగా వేధిస్తోంది.

నాలుగున్నరికి, "శారదా! మీ కజిన్ కమలా వాళ్లింటికి వెళ్దామని అంటున్నావు కదా. ఈరోజు వెళ్దాం పద" అన్నారాయన.

"ఇప్పుడేం అక్కర్లేదు. అయినా నాకెక్కడా" అన్నాను ముభావంగా.

"ఏం ఫరవాలేదు. శ్వేత రాగానే పాలు తాగి బిస్కట్స్, పళ్లు తింటుందిగా. వంటకి కంగారేం లేదు. వచ్చి ఎంతసేపు వండుతావు, పద" అన్నారు.

"సరే పదండి" కోడలికి చెప్పి బయలుదేరాం.

"దగ్గరేగా స్కూటర్ ఎందుకు?" అంటున్న నాతో, "ఫరవాలేదులే. త్వరగా వచ్చెయ్యాలి కదా" అంటూ సమాధానమిచ్చారు. బయటకు రావడంతో కొంచెం తిక్క తగ్గినట్లయింది.

"ఇటెక్కడికి?" అంటున్న నాకు జవాబివ్వకుండా ఆయన పార్క్‌కి తీసుకువెళ్లారు. అప్పుడే తోటమాలి నీళ్లు పెట్టినట్లున్నాడు. నీరెండలో మిలమిలా మెరుస్తున్న మొక్కలు ఆహ్లాదాన్నిస్తున్నాయి. ఆ వాతావరణం నాకు కొంత స్వాంతన కలిగించినా నా ముభావపు ముసుగును తొలగించలేకపోయింది.

"ఏంటి శారదా! అదోలా ఉంటున్నావు? అలసటగా ఉంటోందా?" ఆయన మృదువుగా అడుగుతుంటే కళ్ల నిండుగా నీళ్లు చేరాయి.

'అయినా ఛీ! ఇదేంటి? అసహ్యంగా- ఏవో బాధలు పడిపోతున్నదానిలాగ' అనుకుంటూ మొహం పక్కకు తిప్పి జారుడుబండ జారుతున్న పిల్లలను చూడసాగాను.

"నాకు తెలుసు. నువ్వు నీ ఫ్రెండ్ కళ్యాణిలాగా పూజలు, వ్రతాలు చెయ్యలేకపోతున్నావని. వంట ఇంటికే అంకితమైపోవాల్సి వస్తోందని బాధపడుతున్నావు అవునా?"

నాకు గతుక్కుమన్నట్లయింది. కానీ వెంటనే రోషం కూడా వచ్చింది. "ఏం నాగురించి నేను ఏం ఆలోచించుకోకూడదా?" అని.

"నీకీ మధ్యన పని ఎక్కువగా ఉంటోంది. ఇదివరకటి ఓపిక లేకపోవడమూ సహజమే. కానీ నువ్వు ఎవరికోసం కష్టపడుతున్నావు? మన కుటుంబం గురించే కదా.



నువ్వు మరోరకంగా ఆలోచించేదానివి కాదని నాకు బాగా తెలుసు. కానీ ఈమధ్యన ఫ్రస్ట్రేషన్ వలన డిప్రెస్ అవుతున్నావు. నేను కూడా నా బాధ్యతల్ని కొన్ని మర్చిపోయాను" అంటూ నా పాదాల మీద ఉన్న చీర కుచ్చిళ్ల అంచుని సవరించసాగారు. వెంటనే పాదాలు వెనక్కి లాక్కుని "మీరేం చేశారు?" అన్నాను ఆశ్చర్యంగా.

"నేను రిటైర్ అయిన నాలుగు నెలల నుండీ నాకు లైఫ్ బోర్ కొట్టకుండా ఎలా కాలక్షేపం చెయ్యాలా అని చూసుకున్నానుగానీ. నీకూ విసుగ్గా ఉంటుంది, బయటకు తీసుకెళ్తూ ఉండాలని తట్టలేదు. ఒకటి రెండుసార్లు అడిగినా శ్వేత వచ్చే టైమైందని, మరొకటని నువ్వు అభ్యంతరపెట్టడంతో సర్లే నీకు ఇల్లు చూసుకోవడమే ఆనందం అని వదిలేశాను. నీకూ అదే సంతోషకరమైన విషయం. కానీ ఇహ బంధాల్లో ఇరుక్కుపోయి పరాన్ని సాధించలేకపోతున్నావని నీలో సంఘర్షణ మొదలయ్యింది. ఒక్క విషయం గుర్తుంచుకో శారదా! నువ్వు చేసే ఇంటి పనులు నీ ఫ్రెండ్ కళ్యాణి చేసే వ్రతాలు, పూజలు కన్నా ఎంతో గొప్పవి."

నా కళ్లల్లో ఆశ్చర్యం కనిపించిందో ఏమో "అవును శారదా!" అంటూ ఆయన కొనసాగించారు. "గోపాలం ఈమధ్యన అస్తమానూ నాదగ్గర మొత్తుకోవడమే. ఎప్పుడూ గుళ్లు, గోపురాల పిచ్చితో కళ్యాణి బొత్తిగా ఇంటి విషయాలు పట్టించుకోవట్లేదుట. వాళ్ల కొడుకు, కోడలు ఇబ్బంది పడుతున్నారుట. కోడలు ఆఫీసు టైమ్‌కి అందరికీ అన్నీ అమర్చి బయటకు వెళ్లి, మళ్లీ రాగానే పని మొదలుపెట్టుకుంటుందిట. తనకు చాలా మొహమాటంగా ఉంటోందని, కనీసం ఆరిన బట్టలు మడతపెట్టడం లాంటి పనులు కూడా చెయ్యడం లేదని వాడి గొడవ. ప్రస్తుతానికి ఆ పిల్ల పైకి అనకపోయినా విసుక్కుంటే ఇంట్లో ఇంక రోజూ గొడవే కదరా అంటాడు వాడు. అనీమియా పేషెంట్‌లా తయారైన వాళ్ల కోడలు నీరజను చూస్తుంటే నాకూ బాధనిపించింది. మన కోడలు లలిత, నువ్వు ఎంతగా కలిసిమెలసి పనులు చేసుకుంటారు. తనకి బెడ్‌రెస్ట్ మూలంగా నీమీద భారం ఎక్కువయ్యింది. నిజమే. కానీ అందుకు ఆ అమ్మాయి పాపం బాగా ఫీలవుతోందనే విషయం నీకూ తెలుసు. రామానికి ఆఫీసు మూలంగా వాడికి సాయం చెయ్యడం కుదరదు. శ్వేత చిన్నపిల్ల. పనీపాటూ లేకుండా ఖాళీగా ఉన్నవాడిని నేనున్నాగా. నాకేమైనా పనులు చెప్తూ ఉండు. అయినా మొదటినుండి నాకేం చెప్పకుండా మొద్దబ్బాయిని చేసేశావు. ఇప్పుడు చూడు నీకెంత నష్టమో?" తన సహజ హాస్య ధోరణిలోకి దిగిపోయారాయన.

"ఎప్పుడూ సరదాగా దేన్నీ పట్టించుకోనట్లు కనబడే ఆయనలో ఇంత విశ్లేషణ ఉందా?" అనిపించింది. నా గుండెలమీద ప్రొద్దున్నుంచీ ఉన్న బరువంతా చేత్తో తీసేసినట్లయింది.

"చాల్లెండి సంబడం! పదండి ఇంక వంట చేసుకోవాలి. ఏడున్నర అయినా అవకుండా శ్వేత కన్నా ముందే మొదలుపెడతారు. "ఏం వండావోయ్?" ముసిముసిగా నవ్వుకుంటూ లేచాను.

"నిజమేనోయ్. రిటైర్ అయ్యాక ఆకలి పెరిగింది. కారణమేమిటంటావ్?" అన్నారు యమా సీరియస్‌గా.

"అవును. ఆఫీసులో ఉన్నన్నాళ్లు అందరి బుర్రలూ తినేవారు. ఇప్పుడు వాళ్లెవరూ దొరకడంలేదుగా" నవ్వాను.

"అమ్మయ్య! నవ్వారండి అమ్మాయిగారు. మరొక్క విషయం. ఇలా మనం రోజూనో, రెండు రోజులకోసారో బయటకు వస్తూ ఉందాం. అబ్బాయి, కోడలూ కూడా ఆ టైమ్‌లో కాస్త ఫ్రీగా ఉంటారు. వాళ్లు శ్వేత చేత హోమ్‌వర్క్‌లూ గట్రా చేయించుకుని ఉంటే టైమ్‌కి మనం వెళ్లచ్చు ఏం?" గబగబా అన్నారు.

"అబ్బో! చాలా విషయాలు ఆలోచించేసారే?"

"మరేంటనుకున్నావు? నన్ను ఇప్పటికైనా గుర్తించు మరి" అంటూ స్కూటర్ వైపు నడిచారు.

వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర ఐదునిమిషాలు ఆగి వెళ్దామని దిగాము. దర్శనం చేసుకుని మెట్లమీద కూర్చున్నాం. ఘంటసాల భగవద్గీత వీనులవిందుగా వినిపిస్తోంది. "కర్మ సన్యాసములు రెండూ మోక్షసోపాన సాధనములు. అందు కర్మ పరిత్యాగము కన్నా కర్మానుష్ఠానమే శ్రేష్ఠమైనది" ఘంటసాలగారి శాంత గంభీర స్వరం నా మనసులోని బాధనంతా ప్రక్షాళనం చేసేసింది. "అవును. నేను ఎంచుకోవాల్సింది, నాకు తృప్తినిచ్చేదీ ఈ కర్మయోగమే" మనసారా అనుకున్నాను.